## క్లుప్తంగా

### రేషన్ బట్వాడా చేసే యంత్రాల పరిశీలన



తూనిక యంత్రాలను పరిశీలిస్తున్న డీలర్లు

మునగపాక: రేషన్ డిపోలకు అందించే తూనిక యంత్రాలను స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం పరిశీలించారు. తూనిక యంత్రాలతో పాటు బయోమెట్రిక్ మిషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తకుండా రేషన్ డీలర్లు ముందుగానే సరి చూసుకున్నారు. ఇందు కోసం మిషన్‌ను మెరుగుపరిచే ప్రక్రియను స్థానిక డీలర్లు వినియోగించుకుంటున్నారు.

### అపరాల సాగుపై అవగాహన



నామవరంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న అధికారులు

పాయకరావుపేట: అపరాలు(చిరుధాన్యాలు) సాగుపై రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ అవగాహన కల్పించారు. మంగవరం, నామవరం, పీఎల్ పురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్ వినియోగించే పద్ధతిని ఆయన వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పంట పొలాలను సందర్శించి అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రైతులకు పెట్టుబడులు, దిగుబడులపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ రైతు సంక్షేమ సంఘం ప్రతినిధి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి



చినదొడ్డిగల్లులో మానవహారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నక్కపల్లి: పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి నాణ్యమైన విద్యనందించాలని చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వై.వి.రమణ కోరారు. మంగళవారం వారు గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అనుభవం, విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. నాణ్యమైన బోధన అందుతుందన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు కూడా యోగాడేలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### ఎస్.రాయవరం మండల సమావేశం రేపు

ఎస్.రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షత నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

### కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

అచ్యుతాపురం రూరల్ : ఎర్రవరం గ్రామంలో కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్టు అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ తెలిపారు. ఎర్రవరం గ్రామ శివార కొండ ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కోళ్లు, రూ.420 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎటువంటి పందేలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మలేరియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఆరోగ్య సహాయకుడు అప్పలకొండ

అచ్యుతాపురం రూరల్ : మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని అచ్యుతాపురం ఆరోగ్య సహాయకుడు లండా అప్పలకొండ సూచించారు. మంగళవారం మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రగతి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పించారు.

# పడకేసిన పారిశుధ్యం..!

- పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే.!
- దుర్గంధంతో ప్రజలకు తప్పని అవస్థలు
- కానరాని స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర



జల్లూరు గ్రామంలో జనావాసాలలో పేరుకుపోయిన చెత్త

కోటవురట్ల: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అపారిశుధ్యంతో కంపుకొడుతున్నాయి. రహదారులలో పేరుకుపోయిన చెత్త స్వాగతం పలుకుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఊదరగొట్టే స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర ఉత్తిత్తి కార్యక్రమంగా మిగిలిపోతోంది. ఏ ఊరికెళ్లినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి చెత్తను



చౌడువాడలో మెయిన్‌రోడ్డును ఆనుకుని పేరుకుపోయిన చెత్త

తొలగించకపోవడంతో వర్షాలకు కుళ్లి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దుర్గంధం వెదజల్లుతున్న చెత్త కుప్పలు రోగాలను ఆహ్వానిస్తున్నాయి. ఓ పక్క కుళ్లిన దుర్గంధం, మరో పక్క దోమల దాడితో జనాలు రోగాలతో సావాసం చేస్తున్నారు.

మండలంలోని 25 పంచాయతీలలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రహదారులు, వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురికి గుంతలు, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. జల్లూరు, చౌడువాడ, యండపల్లి, బి.కె.పల్లి, కోటవురట్ల తదితర గ్రామాలలో చెత్త పేరుకుపోయింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నా అవన్నీ నిరుపయోగంగా మిగిలిపోయాయి. పారిశుధ్య పనులు చేపట్టకపోవడం, చెత్త సేకరణ లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా దర్శనమిస్తోంది. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో తూతూ మంత్రంగా బ్యానర్లు చేతబట్టి ర్యాలీలు చేయడం మినహా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో స్వచ్ఛ గ్రామాల కోసం గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేవారు. తద్వారా గ్రామాలు ఆహ్లాద వాతావరణంతో కనిపించేవి. సంపద తయారీ కేంద్రాలలో తయారైన సేంద్రియ ఎరువును తక్కువ ధరకే రైతులకు విక్రయించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో పాలన పడకేసింది. దాంతో పాటే పల్లెలూ అపారిశుధ్యంతో అల్లాడిపోతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ఇకపై పూర్తి స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోతే రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంది.



యండపల్లిలో మెయిన్‌రోడ్డును ఆనుకుని చెత్త కుప్ప



జల్లూరులో మెయిన్‌రోడ్డును ఆనుకుని దుకాణాల వద్ద చెత్త కుప్ప

### రహదారులే డంపింగ్ యార్డులు..



రహదారులే డంపింగ్ యార్డుల్లా తయారయ్యాయి. రహదారుల వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వీటికి తోడు రహదారుల వెంబడి మలవిసర్జనతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డులో నడవాలంటే ముక్కు మూసుకోవలసిందే. చాలా కాలంగా చెత్త కుప్పలను తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెందాయి. అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలి.

– గొర్లి రాఘవులు, చౌడువాడ

### వ్యాధులు ప్రబలుతున్నాయి..



పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదు. చాలా గ్రామాల్లో రహదారుల వెంబడి చెత్త పేరుకుపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అధ్వాన పరిస్థితులు నెలకొంటున్నాయి. దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. పరిస్థితి ఇలాగే ఉంటే రోగాలు చుట్టుముట్టడం ఖాయం. ఇప్పటికే జ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా రోగులు పెరుగుతున్నారు. అధికారులు స్పందించకపోతే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంది.

– చామంతుల శ్రీనివాసరావు, కైలాసపట్నం

ఇప్పటికే పలు గ్రామాలలో జ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టకపోతే పల్లె ప్రజలు రోగాలతో మంచం పట్టే ప్రమాదం ఉంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## 'కూటమి' మోసాలు ప్రతి ఇంటికీ చేరాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అచ్యుతాపురం మండలం నాయకులు



'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం'పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ నాయకులు

ఎస్.రాయవరం: ఏడాది కాలంగా కూటమి నేతలు చేస్తున్న మోసాలు ప్రతి ఇంటికీ తెలిసేలా వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేయాని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు పిలుపునిచ్చారు. మంగళవారం అడ్డురోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఎస్.రాయవరం మండల నాయకుల సమక్షంలో 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం'పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాలు పుస్తక రూపంలో వివరంగా ఉందని, వాటిని గ్రామ స్థాయిలో ప్రజలకు తెలిసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నా చంద్రబాబు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కేసుబోయి వెంకటలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, జిల్లా కమిటీ సభ్యుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం గాలికొదిలేసిన బాబు**

అచ్యుతాపురం రూరల్ : అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు గాలికొదిలేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు ఆరోపించారు. మంగళవారం అచ్యుతాపురంలోని పార్టీ కార్యాలయంలో 'జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం'పుస్తకాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఒకరిద్దరు నాయకులు పార్టీ మారడానికి గల కారణం, కూటమి నాయకుల ప్రలోభాలు, బెదిరింపులని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) నాయకత్వంలో మండలంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ఎక్కడ చూసినా హత్యా రాజకీయాలు, దోపిడీలు, దొంగతనాలు పెరిగిపోయాయన్నారు. ప్రజల దృష్టిని మరల్చడానికి రెడ్ బుక్ అనే భూతాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారన్నారు. ప్రజల పక్షాన ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తామని చిలుక పలుకులు పలికిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. అర్హులై ఉండి కూడా తల్లికి వందనం పథకం అమలు కాని తల్లులు సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్యబుజ్జి, పార్టీ మండల నాయకుడు మారిశెట్టి సూర్యనారాయణ, జెడ్పీటీసీ లాలం రాము, కో–జెడ్పీటీసీ నర్మాల కుమార్, వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మావతిశ్రీనివాస్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు సియ్యాద్రి బుజ్జి, సర్పంచ్‌లు కూండ్రపు విమలానాయుడు, పంచదార్ల పైడిరాజు, కూండ్రపు సత్యారావు, ఎంపీటీసీలు జువ్వల నాయుడు, చేపల శ్రీరాములు, ఉమ్మిడి అప్పారావు, జగన్, మాడెం సూరి అప్పారావు, కారుకుండి శ్రీను, పంచదార్ల రవి, పంచదార్ల చిన్న పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలి

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రెండో విడత కింద కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1121 కోట్లను ఐదు నెలల కిందట రాష్ట్రానికి విడుదల చేసిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు అందజేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల వాటాను ఇవ్వకపోవడంతో పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిలిచిపోతున్నాయని, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నారన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యం పనులు కుంటుబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు మంజూరు చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, కాండ్రేగుల రాము, తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలకు అనుగుణంగా సాగు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసాద్

మునగపాక: భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త ప్రసాద్ తెలిపారు. మండలంలోని అరబుపాలెం గ్రామంలో మంగళవారం బీసీటీ కేవీకే, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగులో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిలో ఎద జల్లే పద్ధతి ద్వారా ఖర్చు తగ్గడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదన్నారు. మరింత వ్యవసాయ సమాచారం కోసం రైతులు 1800–4198800 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రసాద్

నక్కపల్లి: రైతుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గుల్లిపాడు, ముకుందరాజుపేట తదితర గ్రామాల్లో రైతులకు వ్యవసాయ క్షేత్రాల్లో వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. పథకాలు, యంత్ర పరికరాల గురించి వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టిపెట్టాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా సాగు చేపట్టాలన్నారు. యంత్ర పరికరాల వినియోగంపై రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజన్ కోసం రైతులు దుక్కులు ప్రారంభించాలని సూచించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కొప్పిశెట్టి వెంకటేష్, సర్పంచ్ సూరిబాబు, ఏఈవో సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆందోళన



ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆందోళన చేస్తున్న పెదపల్లి గ్రామస్తులు

యలమంచిలి రూరల్: పూర్వపు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైన 3.73 ఎకరాలను ఇటీవల అధికారులు 22ఏ జాబితా నుంచి తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో మంగళవారం మూడు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. ఎర్రవరం రెవెన్యూ పరిధి పెదపల్లిలో సర్వే నంబరు 286లో 12.49 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని, గతంలో ఇక్కడ చెరువు ఉండేదని, దీనిలో 3.73 ఎకరాల భూమిని కొందరు అక్రమార్కులు స్వాధీనపర్చుకున్నారంటూ ఆరోపిస్తూ గ్రామస్తులు ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 22ఏలో ఉన్న ఈ భూమిని ఇటీవల జిరాయితీ భూమిగా మార్పు చేయడంపై ఆందోళనకారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ప్రధాన నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో వారంతా మాట్లాడుతూ ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాత పూర్వక ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అవసరమైతే న్యాయస్థానాల ద్వారా ఈ అక్రమంపై పోరాటం చేయనున్నట్టు వారు తెలిపారు. దాసరి కుమార్, దాసరి గణేష్, బొద్దపు శ్రీనివాసరావు(రమణ), బొద్దపు శ్రీను, బొద్దపు నాగేశ్వరావు, కోడిగుడ్డు రమణబాబు, దుంగా అచ్యుతరావు, నమ్మి రమణ, పడాల నాగేశ్వరావు, మరిశా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ వార్షిక శిక్షణ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజయం సాధించిన విద్యార్థులు

పాయకరావుపేట: ఆరో ఆంధ్రా ఎన్‌సీసీ నావెల్ యూనిట్ సూరంపాలెంలో ఈ నెల 8 నుంచి 17 వరకు జరిగిన వార్షిక శిక్షణ శిబిరంలో నిర్వహించిన పలు పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎల్.సాయి భువనేష్, డి.కృష్ణ సాయితేజ, బి.నరసింహ, కె.కవివర్ధన్, ఎ.చంద్రశేఖర్, టి.రామ్ మణికంఠ వాలీబాల్ పోటీలో మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకాలు సాధించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ అజయ్ యాదవ్, గ్రూప్ కమాండర్ రితిన్ మోహన్ అగర్వాల్, ఎస్.ఎం.గోవిందరావు నాయకత్వంలో ఈ శిబిరం నిర్వహించారు. సత్తా చాటిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, తదితరులు అభినందించారు.

## పుస్తకాలు సరే.. బ్యాగుల పంపిణీ ఎప్పుడు?

ఎస్.రాయవరం: పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగు ఇవ్వాలి కదా అని జెడ్పీటీసీ కాకర దేవి ప్రశ్నించారు. చిన గుమ్ములూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు టెస్ట్ బుక్స్ పంపిణీ చేశారు. పుస్తకాలు ఒక్కటే ఇవ్వడం చూసి ఆమె ఉపాధ్యాయులను ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాలు, షూస్, తదితర సామగ్రిని జగనన్న కిట్ పేరిట ఒకే దఫా ఇచ్చేవారమని గుర్తు చేశారు. దీంతో పుస్తకాలు ముందుగా వచ్చాయని, బ్యాగులు కూడా రవాణాలో ఉన్నాయని, మరో రెండు రోజుల్లో అందజేస్తామని ఉపాధ్యాయులు బదులిచ్చారు.

### ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

అనకాపల్లి టౌన్: చాకచక్యంగా ద్విచక్ర వాహనాలు తస్కరిస్తున్న దొంగను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశామని పట్టణ క్రైం ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు మంగళవారం తెలిపారు. పట్టణ సీఐ టి.వి. విజయ్‌కుమార్ పర్యవేక్షణలో తుమ్మపాల ఏలేరు కాలువ వద్ద సోమవారం నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. చీడికాడ మండలం, అదే గ్రామానికి చెందిన మాకాల ధనుకుమార్ పరవాడ కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడన్నారు. ఇతను ఇటీవల వేల్పులవీధి రాఘవేంద్రస్వామి గుడి వద్ద ఇంటి ముందు పార్కు చేసిన గ్లామర్ బైక్, పూడిమడక రోడ్ రామాలయం వద్ద పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగలించాడని తెలిపారు. నిందితుడు నుంచి పల్సర్ బైక్ స్వాధీనం చేసుకోని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బోదిగల్లంలో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు



శ్రీరాంపురంలో యోగా చేస్తున్న కార్మికులు



మునగపాకలో యోగా సాధన చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: యోగా డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. మంగళవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఆర్‌కే బీచ్‌లో 5 లక్షల మంది ఒకేసారి యోగా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొనాలన్నారు. పెదబోదిగల్లం పాఠశాలలో మాస్టర్ ఎస్‌వీఎస్ ఆచార్యులు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగాతో ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఒత్తిడిని జయించవచ్చని ఆయన చెప్పారు.

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించినట్టు ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీరాంపురంలో పారిశుధ్య కార్మికులకు యోగాపై గ్రామ కార్యదర్శి వైవీ సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మునగపాక: యోగా సాధన ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఈవోఆర్డీ సోమరాజు తెలిపారు. మునగపాక రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న యోగా సాధన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా వేడుకల విజయవంతానికి ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సహకరించాలన్నారు.

## వసతి గృహం ఏర్పాటు చేయాలని వినతి



బీసీ సంక్షేమ శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్

అనకాపల్లి టౌన్: పట్టణంలో 2వ బీసీ మహిళా వసతి గృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళలకు బీసీ మహిళా వసతిగృహం ఒకటే ఉండడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు చదువుకోవడానికి ఇక్కడ అవకాశం లేకుండా పోతుందన్నారు. తక్షణమే జిల్లా కేంద్రంలో రెండో వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బి. బాజ్జీ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వారికి సరైన వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.